# కుడి ఎడమైతే

● శ్రీమతి జె. సుశీల

మధ్యాహ్నం ఏమీ తోచక దిండు గలేబులు కుడుతున్న జానకి అటుగా వచ్చిన వైదేహిని చూసి "ఏమిటి వైదేహీ," అంది.

"అబ్బె ఏం లేదు వదినా - నిద్ర రావటంలేదు. నువ్వేం చేస్తున్నావో అని ఇలా వచ్చాను" తటపటాయిస్తూ అంది వైదేహి.

అయితే వైదేహి ముఖకవళికలను బట్టి విషయం ఏదో ఉందని గ్రహించిన జానకి "ఏమిటి వైదేహీ అలా ఉన్నావే ! నీ ముఖం చూస్తుంటే ఏదో దాస్తున్నావులా వుంది. నాక్కూడా చెప్పలేనంత రహస్యమా !" కుడుతున్న దిండుగలేబు పక్కన పెడుతూ అంది.

"అదేమిటి వదినా ! చిన్నప్పటి నుంచి నీ దగ్గరే పెరిగాను. నీ దగ్గర రహస్యమేముంది" ఇంకా ఏదో అనబోతున్న వైదేహిని మధ్యలోనే ఆపుతూ.

"అయితే నీ మనసులో వున్నది దాచకుండా చెప్పెయ్యి" అంది జానకి.

ఇక ఆలస్యం చేయదలచుకోలేదు వైదేహి .... "అదే వదినా నా పెళ్ళి విషయం" అంటూ ఆగి వదినగారి ముఖంలోకి చూసింది.

"ఊ ! నీ పెళ్ళి కిప్పుడేమయింది - వారందరికి నువ్ నచ్చావుట. కట్నం కూడా అక్కర్లేదన్నారు. ఏదో మన అదృష్టంకొద్దీ ఈ సంబంధం దొరికింది." అంది జానకి మళ్ళీ దిండుగలేబు చేతిలోకి తీసుకుంటూ !

"కానీ - నాకిపెళ్ళి ఇష్టం లేదు వదినా !"

ఆడపడుచు మాటలకి అవాక్కయింది జానకి.

"ఏం ! వైదేహీ ! ఎందుకిష్టంలేదు - అతనంటే యిష్టం లేదా ! లేకపోతే అసలు పెళ్ళంటేనే యిష్టం లేదా !" అంది

"నేను రాజాని ప్రేమించాను."

గంభీరంగా వచ్చిన ఆ జవాబుకి ఉలిక్కిపడింది. జానకి. "వైదేహీ ! నీకేమయినా మతి పోయిందా , అతని

కేం తక్కువయిందని నచ్చలేదు. ఆస్తి తక్కువా! అంతస్తు తక్కువా! లేక సాంప్రదాయం తక్కువా!" సౌమ్యంగా అడుగుదామన్న జానకి గొంతులో తీవ్రత ధ్వనించింది.

"రాజా కూడా నువ్ చెప్పిన వాటిలో వేటిలోనూ తక్కువకాడు వదినా! నా మనసుకు నచ్చారు" అంది వైదేహి.

జానకిక్కి కోపం వచ్చేసింది "రాజాకి అన్నీ ఉన్నాయి. కాదన్ను కాని వాళ్ళ వంశం గురించి ఆలోచించావా! మనసుకు నచ్చినంత మాత్రాన మనువాడితే తర్వాత ఫలితం ఎలాఉంటుందో ఒక్కసారి ఊహించుకో!..." ఇంకా ఏదో అనబో తున్న వదినగారి మాటలకు అడ్డువస్తూ....

"ఇందులో ఆలోచించటానికేమీలేదు వదినా...వాళ్ళ వంశంలో వాళ్ళకి పిచ్చి ఉందంటావు అంతేనా! కాని రాజాకి లేదుగా!" అంది వైదేహి.

"రాజాకు లేకపోవచ్చు వైదేహీ! కాని వాళ్ళ నాన్నగారికి ఉంది. వాళ్ళ తమ్ముడికి ఉంది. రేపు నీ పిల్లలకికూడా వాళ్ళ పోలికలే వస్తే—అనుక్షణం ఆ వాళ్ళను చూస్తూ నీ గుండెలో చెలరేగే పిచ్చి మంటను భరించగలవా చెప్పువైదేహీ? వీళ్ళది పిచ్చి వంశమని అయిన వాళ్లు, కాని వాళ్ళు కూడా ఆక్షేపిస్తూంటే నువ్వు మయిపోతావో! ఒక్కసారి ఆలోచించు ఏ.తీవ్రంగా అంది జానకి."

వదినగారి మాటలకి కొద్దిగా చలించింది వైదేహి.

కానీ "జన్మ జన్మలకీ నువ్వే కావాలి వైదేహి" అన్న రాజా మాట జ్ఞాపకం వచ్చి వైదేహి మళ్ళ మామూలుగా మారిపోయి—

"వదినా! అనవసరంగా నాలో లేని భయాన్ని కల్గిస్తున్నావు. వాళ్ల వంశంలో పిచ్చి వున్నంత మాత్రాన మా పిల్లలకి కూడా రావాలని లేదుగా! మనస్సు మార్చుకోవటం, మనస్సు చంపుకోవటం నా కిష్టంలేదు. ఇదేనా నిర్ణయం" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

వైదేహి మాటలకి నిశ్చేష్టురాలైంది జానకి.

* * *

ఆ రాత్రి భార్య ద్వారా విషయమంతా విన్న సారధి ఆశ్చర్యపోయాడు ఏమిటీ వైదేహి రాజాను ప్రేమించిందా! రాజా మంచివాడే అన్ని అర్హతలు ఉన్నాయి. అసలు తనే రాజా వంశం గురించి తెలియని రోజుల్లో రాజాను వైదేహికి అడుగుదామనుకున్నాడు. కానీ—వాళ్ళింట్లో వాళ్ల కి పిచ్చి ఉందని తెలియగానే ఆ ప్రయత్నం మానుకున్నాడు. కాని ఇప్పుడువైదేహి రాజాని పెళ్ళి చేసుకుంటా నంటోందే. రేపు పెళ్ళయాకా వైదేహి పిల్లలు కూడా...భగవాన్! ఇక ఆలోచించలేకపోయాడు 'ఎలాగయినా చెల్లాయిమనసు



మార్చాలి. లేకపోతే అమ్మానాన్న తనని తిట్టుకుంటారు! ఆలోచనలతో అసంపూర్తిగానే నిద్రపోయాడు సారధి.

మరునాడు ఉదయం ఏదో నవల చదువుతున్న వైదేహి దగ్గరకువచ్చాడు సారధి. "ఏమిటమ్మా చదువుతున్నావు" అన్నాడు.

"ఏదో నవల అన్నయ్యా! చాలా బావుంది. కాని నాకు ఒకటే నచ్చలేదు అన్నయ్యా" అంది వైదేహి తను చదువుతున్న పేజీదగ్గర మడత పెడుతూ.

"ఏమిటమ్మా అది! నీకు నచ్చలేదంటే ఏదో విశేషం ఉందన్న మాటే" అన్నాడు సారధి తను వచ్చినపని ఎలా

మొదలుపెట్టాలో తెలియక తికమక పడుతూ.

"ఇందులో కథానాయిక తనవాళ్ళ కోసం ఇష్టంలేని మనువు చేసుకుని అనుక్షణం నరకయాతన అనుభవిస్తుందన్నయ్యా! అందులో చదువుకున్నది కూడాను" అన్నది వైదేహి.

"కన్నవాళ్ళకోసం ఆమాత్రం చేయలేకపోతే యింక రక్తసంబంధానికేమి అర్థం ఉందమ్మా! చదువుకుంది కాబట్టే పరిస్థితుల్ని అర్థంచేసుకుని కన్నవారికి యిష్టమైనవాణ్ణి కట్టుకుంది" అన్నాడు సారధి తను చెప్పదలుచుకున్న దానికి ఉపోద్ఘాతంగా.

"అన్నయ్యా!" అంది అన్నగారి మాటల్లోని అంతరార్థాన్ని కొంతవరకు గ్రహించిన వైదేహి.

"అవునమ్మా - మా మీద నమ్మకం వుంచి- నీకు మేమేదో అన్యాయం చేస్తున్నామని అనుకోకపోతే మేము కుదిర్చిన సంబంధానికి ఒప్పుకో అమ్మా - ఇదేనమ్మా నీ అన్నయ్య కోరేది." వైదేహి అక్కడపెట్టిన నవల ముఖచిత్రం తీసి చూస్తూ తను అనుకున్నది చెప్పేశాడు సారధి. సారధి గొంతులో లీలగా ధ్వనించిన బాధ వైదేహిని కలవరపెట్టింది. తన్ని కళ్ళలో పెట్టుకుని పెంచిన అన్నా వదినలను కష్టపెడుతున్నానేమో అనుకుంది. కాని అప్పటికే తనొక నిశ్చయానికి వచ్చేసింది.

అందుకే స్థిరమైన గొంతుతో "నన్ను క్షమించు అన్నయ్యా! రాజాను మరిచిపోవటం నా వల్ల కాదు." అంది.

"ప్రయత్నిస్తే సాధ్యంకానిదంటూ ఏదీ లేదమ్మా. నూరేళ్ళు పండుగా గడప వల్సిన జీవితాన్ని కోరిన రకంగా మార్చుకోకు. జీవితంలో పండు వెన్నెలలు కురిపించుకోవల్సింది పోయి చీకటి మయం చేసుకుంటావా అమ్మా-" సారధి గొంతు జీరగా పలికింది.

"ప్రయత్నించి రాజాని మర్చిపోవటానికి అతనేం పాపం చేశాడన్నయ్యా! వాళ్ళింట్లో వాళ్ళకి పిచ్చి ఉన్నంత మాత్రాన ఇక అతను వివాహానికే తగడా!" ఆవేశంగా అంది వైదేహి.

"తగడని కాదమ్మా - కాని, మామయ్యా అంటూ ముద్దుగా పిలుస్తూ మా చేతుల్లో తిరగవలసిన నా చెల్లాయి పిల్లలు పిచ్చివాళ్ళయితే నేను భరించలేనమ్మా— భరించలేను. ఈ ఒక్క విషయంలో ఈ అన్నయ్య మాటను మన్నించమ్మా...." ప్రతిమాలుతున్నట్టుగా ఉంది సారధి గొంతు.

"అన్నయ్యా! అమ్మా నాన్నలను మరిపించావు. కొండమీది కోతినితెచ్చిమ్మన్నా యిచ్చావు. కోరినంత చదువు చెప్పించావు. అలాగే నీ చేతులమీదుగా నేను కోరుకునే రాజానిచ్చి పెళ్ళిచేసి నా చివరి కోరికనుకూడా ఆనందంగా నెరవేర్చన్నయ్యా!" వైదేహి కళ్ళలో

చిప్పిలుతున్న నీటి బిందువులనుచూసి చలించిపోయాడు సారథి.

"వద్దమ్మా! నీ కంటి నీరు నే చూశ్లేను...అలాగే కాపీ నీ యిష్ట ప్రకారమే నీ రాజాతోనే పెళ్ళి జరిపిస్తానమ్మా ...." అంటూ అక్కడనించి బరువెక్కిన హృదయంతో వెళ్ళిపోయాడు సారథి.

* * *

తర్వాత కొద్దిరోజులకి రాజా—వైదేహి దంపతులయ్యారు. వారి దాంపత్య జీవితాన్ని ఆనందమయం చెయ్యాలని భగవంతుణ్ని కోరుకున్నాడు సారథి. ఆ రాత్రి వైదేహిని దగ్గరికి తీసుకుంటూ నేను చాలా అదృష్టవంతుణ్ని వైదేహి అన్నాడు రాజా. "మన ఇద్దరం అదృష్టవంతులమేనండి- కాని మన పిల్లలు" అంటూ ఆగిపోయింది. ఆమె ఆలోచన అర్థంచేసుకున్న రాజా " ఛ ...ఏమిటి వైదేహి అ మాటలు ... నువ్వటువంటి ఆలోచన పెట్టుకొని మనస్సు పాడుచేసుకోకు. మన పిల్లలు కూడా అదృష్టవంతులే అవుతారు." అన్నాడు. రాజా హృదయం మీద తల ఆన్చి అతని మాటలువింటూ కొంతవరకూ ఊరట పొందింది వైదేహి.

* * *

ఆరోజు సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన రాజా రోజులా చిరునవ్వుతో వైదేహి రాకపోయేసరికి కంగారుపడి లోపలకు వెళ్ళాడు. వైదేహి నీరసంగా మంచం మీద పడుకుని ఎదురుగా ఉన్న గోడ మీద బాబు కేలండర్ వైపు చూస్తోంది. రాజా రావటం చూసి ఉలిక్కిపడి లేచింది.

"ఏం వైదేహి - అలా ఉన్నావే... ఒంట్లో బాగుందలేదా! డాక్టర్‌కి ఫోన్ చెయ్యనా" అని జవాబుకి ఎదురు చూడకుండానే వెళ్ళి ఫోన్ చేశాడు.

* * *

"కంగ్రాట్యులేషన్స్ మిస్టరు రాజా! మీకు నాన్న బిరుదు యివ్వడానికి మీ యింటికి ఓ బుజ్జి పాపాయి రాబోతున్నాడు" డాక్టర్ అరుణ మాటలు అమృతప్రాయంగా సోకాయి రాజా చెవులకి.

"అ బైదిబై - ఆమె చాలా వీక్‌గా కనబడుతోంది. మానసికంగా ఏదో బాధ పడుతున్నట్లుంది. ఈ సమయంలో మనసులో ఎటువంటి ఆలోచన్లు రానివ్వకూడదు. చాలా ఆనందంగా ఉండాలి. లేకపోతే ఆమెకూ, పుట్టబోయే వాళ్ళకు కూడా ప్రమాదమే! ఇవిగో ఈ టానిక్స్ తెప్పించి వాడండి. వస్తానూ ," అంటూ చేతిలో స్టెత్ మెళ్ళో చుట్టుకుంటూ కారు వైపు నడిచింది అరుణ.

ఆమె మాటలు నెమరు వేసుకుంటూ లోపలికి నడిచాడు రాజా.

"విన్నావా! వైదేహి - డాక్టర్ ఏం

చెప్పిందో-నీ ఆనందం కోసం నేనే మయినా చేస్తాను. అంతేగాని అర్ధంలేని ఆలోచనతోనువ్వు బాధపడకు - నన్ను బాధ పెట్టకు" బేలగా అంటూన్న భర్త కేసి చూస్తూ....

నాకేదో భయంగా ఉందండీ"

అదిగో అలాగే మాట్లాడొద్దు ... అన్నట్టు వైదేహి...నిన్న డాక్టరిని అడిగితే ఏం చెప్పిందో తెలుసా: వంశంలో కొందరికి పిచ్చి ఉన్నంత మాత్రాన అందరికీ రావాలని లేదుట అందుచేత మన పిల్లలకి అటువంటిదేం జరగదు. మన పిల్లలు పిచ్చి వాళ్ళవరు వైదేహి వాళ్ళు దేశ నాయకులై దేశాల్ని ఏలేస్తారు. కాబట్టి నువు అటువంటి భయాలేం పెట్టుకోకు—" భార్యని ఓదార్చటానికి అలా అంటున్నాడే గాని తనక్కి ఓ మూల భయం లేక పోలేదు.

రోజులు దొర్లిపోతున్నాయి ...... రాజా ఓదార్పుమాటలుగాని, డాక్టర్ అరుణ ప్రిస్క్రైబ్ చేసిన టానిక్‌లుకాని ఏవీ పనిచేయటంలేదు వైదేహికి.

సీమంతపు పెళ్ళికూతుర్ని చూడాలని కొండంతానందంతో వచ్చిన సారథి. జానకి, వైదేహి ని చూసికళ్ళనీళ్ళపెట్టుకున్నారు. వైదేహి ఇలా అయిపోవటానికి తమే కారణమేమో అనుకున్నారు. సారథి చెల్లాయిని తనతోపాటు తీసుకు వెడతానన్నాడు .. కాని రాజా - "వద్దు సారథీ _వైదేహిని డిస్పెన్సరీతో చేర్పిద్దామనుకుంటున్నాను. అందులోను మనం ఉండేది ఒకఊళ్లోనేకదా-ఎక్కడయిదే త్రేనేం. అందులోనుకాన్పు కష్టం కావచ్చు అంటున్నారు డాక్టర్ ...." అన్నాడు. తొలికాన్పు యింటికి తీసుకెళ్ళి పురుడుపోసి పండంటి బాబుతో చీరాసారె పెట్టి పంపిద్దామనుకున్న సారథీ, జానకి మనసునిండ్యాదిగులుతో నిరాశగా యింటికి వెళ్ళిపోయారు.

* * *

బంగాళాఖాతంలో వాయు పందం వల్లనేమో ఆకాశం నిండా మబ్బులు ముసుర్కుకున్నాయి. హోరుగాలివీస్తోంది సాయంత్రం 6 గంటలే అయినప్పటికి రాత్రి ఎనిమిదో-తొమ్మిదో అయినట్టుగా ఉంది. అప్పుడే ఆఫీస్ నుంచి వచ్చిన రాజా ముఖం కడుక్కుని హాస్పిటల్‌కి వెళ్ళటానికి తయారవుతున్నాడు. ఫోన్ మ్రోగింది. హోరుగాలికి గోడ మీద ఉన్న బాబు క్యాలెండరు ఎగిరి క్రిందపడింది. ఫోన్‌లో అవతలి గొంతు చెప్పిన విషయం విని డాక్టర్" అంటూ అరిచాడు రాజా. గాలికి కరెంటు పోయింది. ఇల్లంతా చీకటితో నిండిపోయింది. అంత హోరుగాలిలోను రాజా స్కూటరు డిస్పెన్సరీ ముందాగింది. వైదేహి వున్న వార్డులోకి పరుగెత్తాడు. డాక్టర్ అరుణ రాజాకి ఎదురుగా వస్తూ -

"మీరు చాలా అదృష్టవంతులు— మా




శాయశక్తులా ప్రయత్నించి తల్లీ బిడ్డలను కాపాడగలిగాము....కానీ-"

"ఊ-కానీ- చెప్పండి డాక్టర్!" అలస్యాన్ని భరించలేక ఆతృతగా అడిగాడు రాజా.

"మరేం లేదు. అయినా నేనిదివరకే చెప్పాను. ఈ సమయంలో అర్థంలేని ఆలోచనలతో మనస్సు పాడుచేసుకోకూడదని. ఇంత చదువుకుని చివరికి సెంటిమెంటల్ ఫూల్‌లా ప్రవర్తించి చింది" అంటూ ఆగింది.

"డాక్టర్ - మీరు చెప్పేదేమిటో-" అయోమయంగా అడిగాడు రాజా.

"ఆమెకి మతిచలించింది. వెంటనే మెంటల్ హాస్పిటల్‌లో చేర్పిస్తే త్వరలోనే కోలుకోవటానికి అవకాశం ఉంది. బిడ్డకు మాత్రం మరేం భయంలేదు."

ఆ తరువాత మాటలేవీ రాజాకు వినిపించలేదు.

బయట కుండపోతగావర్షం ప్రారంభమైంది.

★